# అనగనగా... ఒక కథ

బ్నిం

# లలితమ్మ కోరిక

లలితమ్మ అరవై ఏళ్లు దాటిన పండు ముత్తయిదువ. కానీ ఆవిణ్ని చూస్తే 45 ఏళ్లు ఉంటాయేమోనను కుంటాం.

ఆవిడ హుషారు, చలాకితనం చూస్తే ఇంకో అయిదేళ్లు తగ్గించాలనిపిస్తుంది. రిటైరయిపోయిన మొగుడికి రెండో పెళ్లాం అంటే ఖచ్చితంగా నమ్మేస్తాం-కానీ అది పచ్చి అబద్ధం.

లలితమ్మ ఏటికేడాది తన ఉత్సాహాన్ని పెంచుకుంటూ వయస్సు తగ్గించుకుంటూ తన హాస్య ప్రియత్వంతో నవ్వుతూ తుళ్లుతూ ఉంటుంది.

కానీ అన్నీ అనుకున్నట్లు సాగితే మలుపులు లేని కథలా ఉంటుందను కుంటాడు దేవుడు- అందుకే ఆమెకో చిన్న అనారోగ్యం చూపించి కేన్సర్ అనే దాకా తీసుకుపోయాడు.

భర్త బెంబేలు పడిపోయాడు- భార్య బెంగలేకుండా నవ్వేసింది.

కొడుకులిద్దర్నీ పిలుస్తానన్నాడు రాఘవేంద్ర- "ఎవరితోనూ చెప్పద్దు. ఇంకా ఢోకాలేకుండా రెణ్నెళ్లు బతుకుతానన్నాడుగా డాక్టరుగారు! ఈలోగా మనం హాయిగా ఎంజాయ్ చేద్దాం- నేను ధమాల్లంటే వాళ్లిక్కడో..మీరక్కడో..ఈలోగా ఈ చిలకమ్మ ఈ గోరింకయ్యకి చాలా పన్లున్నాయి. వచ్చే జన్మలో చెయ్యాల్సిన లిస్టు రాసుకోవాలి- ఈ జన్మలో హడావుడిగా చేసుకోవాల్సిన కొడుకులిద్దరి పెళ్లిళ్లు అవగొట్టెయ్యాలి"- ఇలా మామూలుగా మాట్లాడేస్తున్న లలితమ్మని చూస్తే రాఘవేంద్రకి ఆశ్చర్యం, బాధ కలుగుతోంది. ఇంత తేలిగ్గా మృత్యువుని ఆహ్వానిస్తున్న ఆమె గుండె ధైర్యానికి కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు.

"జబ్బు లేదనుకున్నప్పుడు నా గుండె ఎలా కొట్టుకుంటూ ఉండేదో-అలాగే ప్రశాంతంగా కొట్టుకుంటోంది చూడండి" అంటూ గుండెమీద అతని తల ఆన్చి వినమంది.

"ఏవండీ మనది అదృష్టం తెల్సా..టప్‌మని కరెంట్ పోకుండా దేవుడు ఆఫ్ కరెంట్ మిగిల్చాడు. ఇంకో రెండు నెల్లవరకూ మీ ఇష్టమే ఇష్టం..ఎంజాయ్ చెయ్యమన్నాడు" అంటూ భర్తని గుండెలకి హత్తుకుని చిన్నపిల్లాణ్ని చేసి కథలు చెప్పింది. ఓదార్చింది.

రాఘవేంద్రరావు కన్నీళ్లతో బొట్టెట్టుకుంది..అతని కన్నీళ్లకి తన పెదాల్తో ఆనకట్టకట్టింది.

"ఇప్పుడు మన ప్రోగ్రాం వినండి!" ఏదో చెప్పబోతూ అంది లలితమ్మ.

"పెద్దాడి దగ్గరకెళ్లి పెద్ద డాక్టర్లకి చూపిద్దాం" రాఘవేంద్ర గొంతులో వణుకు- కళ్లలో తడి బైటకి తెల్సిపోతుండగా అన్నాడు.

"మన ప్రోగ్రాం వినండి అన్నాను..సలహా అడగలేదు కదా" మళ్లీ నవ్వింది.

దేవుడికి నవ్వుల్నీ పువ్వుల్నీ..అంతలోనే నలిపెయ్యడం ఏ సరదానో అనుకున్నాడు- ఆమెకి జబ్బు 'ఇది' అని తెల్సినప్పట్నుంచీ చూపుని ప్రతిక్షణం ఆమెని చూడ్డానికే వినియోగిస్తున్నాడు- 40 ఏళ్లక్రితం పెళ్లయి కాపురానికొచ్చిన లలితమ్మని ఇంక ఒక్కక్షణం కూడా మిస్ చేసుకోకూడదు అనుకుంటున్నాడు రాఘవేంద్ర.

"ఎక్కడి కెళ్లిపోయారు..గుండ్రాలు..గుండ్రాలా?" అని గలగలా నవ్వేస్తూ లలితమ్మ.

"అబ్బే..కాదు..చెప్పు"

"చెప్పను..చెప్తే..అడ్డపుల్లలూ..ఆర్గ్యుమెంట్లూ వేస్తారు" అంటూ ఫోను చేసి ఇద్దరి కొడుకులకీ 'పదిరోజులు సెలవుపెట్టి రమ్మ'ని చెప్పింది.

పిలుపులు విని కొడుకులు కంగారుపడ్డారు.

"నాన్న ఎలా వున్నారు"

"నిక్షేపంలా నిండు నూరేళ్లు భూమ్మీద ఉండి జల్సా చేయాలని ప్రిపేరవుతున్నారు" అంది.

రాఘవేంద్రకి నవ్వి నవ్వి కన్నీళ్లొస్తున్నాయి భార్య మాటలకి.

"పదిరోజులు సెలవుపెట్టి రమ్మంటే మీ కొడుకులిద్దరూ కంగారుపడిపోతున్నారు" అని భర్తకి వ్యాఖ్యానం చెప్పి-

"మీ ఇద్దరికీ ఈ పదిరోజుల్లో పెళ్లి సంబంధాలు చూసి పెళ్లిళ్లు చేసి- అత్తగా పెత్తనం చలాయించాలని నాకు సరదా పుట్టింది. ఇద్దరి పెళ్లిళ్లకి ముహూర్తాలు ఫిక్స్ చేసాం- శ్రీరామకల్యాణం రోజు అభిజిన్ముహూర్తం"

"...................."

"మీ మొహం- ఇద్దరికీ ఒరోజు పెళ్లి చేయకూడదని మీకెవరు చెప్పారు? జనకమహారాజంతటి మహానుభావుడు దశరథుడి నలుగురు కొడుకులకీ పెళ్లి చేశాడు- నోరు మూసుకుని ఉగాది నాటికి ఇక్కడుండేలా రండి" అంది.

ఇద్దరు కొడుకులూ వంతులు వంతులుగా తల్లి కమేండ్‌నీ డిమాండ్‌ని ఒకే చేశారు.

పెద్దకొడుకు కిరణ్ బ్యాంక్‌లో ఆఫీసర్- చేరుతూనే ప్రొబెషనరీ ఆఫీసరూ, రెండో ఏట అసిస్టెంట్ మేనేజరూ అయిపోయాడు.

రెండో కొడుకు సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం.

పెద్దాడికన్నా జీతం ఎక్కువే సంపాదిస్తున్నాడు.

ఇద్దరూ ఒక రూమ్‌లోనే ఉంటారు.

అమ్మానాన్నల్ని రమ్మంటే ఆ ఎపార్ట్‌మెంట్‌ల్లో తలుపులు మూసుకుని మేం బతకలేం..మాకు మట్టి కాలికం టాలి-నింగి కంటికి కనిపించాలి. వీధుల్లో వాళ్లు పలకరించాలి. వేపచెట్టు నీడలో గచ్చకాయలు ఆడుకోవాలి అని- అవన్నీ వదులుకుని రాలేమని ఖరాఖండిగా చెప్పేశారు ఇద్దరూను.

నిజమే వాళ్లిద్దరూ ఇక్కడకొస్తే పంజరంలో పక్షుల్లాగా వుంటారని రెండ్రోజులు ఉండి వెళ్లినప్పుడు అర్థమైపోయింది వాళ్లకి.

* * *

"భారతీ కమ్ హియర్" ఇంటర్‌కమ్‌లో క్లర్క్‌ని పిలిచాడు.

"రాజమండ్రీలో నీకెవరైనా రెలిటివ్స్-ఫ్రెండ్స్ ఉన్నారా?"

"లేరండీ..అహ..ఉన్నారండీ..కవిత అనీ.."

"ఆ కవితకి ఫోన్ చెయ్యి..నువ్వొస్తున్నానని" బాస్‌లాగా మాట్లాడాడు.

"దేనికి సార్" అని అడగలేకపోయింది. భయం, గౌరవం ఎక్కువైన భారతి.

"ఇదిగో ఈ లీవ్‌లెటర్ మీద సంతకం పెట్టు. మేనేజర్ లేరుగా నేను సేంక్షన్ సిగ్నేచర్ పెట్టాను"

"దేనికి సార్" భయంగా అడిగింది.

"ఇవన్నీ ఇప్పుడు చెప్పను. మా ఇల్లు మా ఇంట్లో వాళ్ళూ నీకు నచ్చితే మిగిలిన వివరాలు మాట్లాడదాం" అన్నాడు. వణికిపోతూ సంతకం చేసింది పెద్దపులి ముందు లేడి పిల్లలా.

"ఇదిగో టిక్కెట్లు-రిటర్న్ టిక్కెట్స్ కూడా ఉన్నాయి. కోచ్ నెంబరు చూసుకుని ట్రైన్ ఎక్కు..రేపు గౌతమికి"

"ఒకే సార్" ఎంతో టెన్షన్‌తో ఏఎస్ఎం గదిలోంచి

బైటపడింది భారతి.

బైటకి..వస్తూనే కవితకి ఫోను చేసింది. కవిత తిరుపతి వెళ్లిందిట! నేనొచ్చేవరకూ ఒక్క రెండ్రోజులు ఎడ్జెస్ట్ అవమని చెప్పింది. ఫోన్‌టచ్‌లో ఉంటానని చెప్పింది.

ఇదెక్కడి గోలరా బాబూ- అనుకుంది వనజ! బాస్ రూమ్‌కి వెళ్లి "కవిత రెండ్రోజుల వరకూ దొరకదు సార్- తిరుపతి వెళ్లింది" అని ఏదో చెప్పబోతుండగా- "నో ప్రోబ్లం- నువ్ మా యింట్లోనే ఉండచ్చు" అని పనిలో పడిపోయాడు.

'ఎందుకో చెప్పలేదు' అని అడుగుదామనుకున్న భారతికి గొంతు పెగల్లేదు. ట్రైన్‌లో కూడా ఇద్దరిమధ్యా ఏమీ మాటలు జరగలేదు. సస్పెన్స్ సినిమాలో కిడ్నాపింగ్ సీన్‌లా వుంది భారతికి.

* * *

భారతిని చెల్లెలు వనజకి అప్పగించి మేడ మీద ఆమె గదిలోకి తీసుకెళ్లమన్నాడు. వనజ భారతితో మాటలు కలిపి "మా ఇంటికి నువ్ కోడలుగా వస్తున్నావు. మా అన్నయ్య మార్కులేసి అమ్మానాన్నల ఎప్రిషియేషన్ కోసం తీసుకొచ్చాడు" అంటుంది.

భారతికి మండిపోయింది 'తనకా పెళ్లి ఇష్టం లేదంది..పైగా..బాసంటే భయం తప్ప ప్రేమ లేదు. పైగా నన్నడగక్కర్లేదా?' అంది.

"కానీ లాభం లేదు- నువ్..బాపు సినిమాల్లో హీరోయిన్లా తెలుగుతనంతో ధగధగలాడిపోతున్నావ్ మా అమ్మకి నచ్చి తీరేస్తావు" అంది స్నేహానుభూతితో వనజ.

స్నానం గట్రా అయి కిందకి వచ్చేప్పుడు భారతి రూపురేఖలు మార్చేసింది.

జీన్‌పేంట్ టీషర్టు వేసుకుని డైనింగ్ టేబుల్ దగ్గర ప్రత్యక్షమైంది- కావాలనే, అతనికి నచ్చదని తెలిసే.

లలితమ్మ కొడుకుకేసి అయోమయంగా చూసింది.


తల్లి చూపుల్ని గమనించి కొడుకు భారతిని ఇంగ్లీషులో తిట్టాడు. తెలుగర్థం "నువ్వీ ఇంటి కోడలిగా పరిచయమౌతున్నావ్..ఇలాంటి డ్రస్‌లో కనిపించడం మా అమ్మకే కాదు నాకూ నచ్చదు" అన్నాడు.

భారతి 'థేంక్స్' అంటూ టిఫెన్ ప్లేట్లో అర్ధాంతరంగా చెయ్యి కడిగేసుకుని నిష్క్రమించింది.

ఆ ఇంట్లో ఓ విచిత్రమైన గంభీర వాతావరణం.

తల్లికి ఆ అమ్మాయి గురించి ఏమీ చెప్పక్కర్లేదని నిర్ణయించుకున్నాడు పెద్దకొడుకు- సెలవుదొరక్క ఆ మధ్యాహ్నం దిగిన చిన్నకొడుకు వివేక్ భారతి మనసుకి నచ్చాడు. అతని మాటా ప్రవర్తనా నచ్చి..ఇద్దరూ స్నేహితులైపోయారు. బైటకెళ్లి..టిఫెను-భోజనం తినిపించేంతలో వివేక్ భారతికి నచ్చాడు..భారతి వివేక్‌ని ఇష్టపడింది. "మీ అన్నయ్య అంటే నాకు భయం గౌరవం తప్ప ప్రేమ పెళ్లి అభిప్రాయం కలగలేదు" అంది.

"బావగారిపట్ల ఉండాల్సినవి ఆ రెండే" అన్నాడు వివేక్.



భారతి వివేక్ మాటల్ని అర్థం చేసుకుంది- తిరిగి తిరిగి ఇంటికివచ్చిన భారతికి కవితని చూడటంతో ఆనందం పెల్లుబికింది-కవితని తన మేడమీద గదిలోకి లాక్కెళ్లిపోయి..తను వచ్చిన కారణం చెప్పింది.

ఇదో పెళ్లిచూపులు అని తను అనుకోలేదని కానీ వివేక్‌తో మనసు కల్సిన విషయం మొహమాట పడుతూ చెప్పింది.

"రక్షించావ్..లేకపోతే నాకు నువ్వు ఆడవిలన్ అయిపోయేదానివి" అంది కవిత.

"ఏమిటీ..ఆడవిలన్నా? అంటే" అంది భారతి.

"మీ బాస్ నేనూ కాలేజీలో కల్సి చదువుకున్నాం..ఆనందంగా నవ్వుతూ ఉండేవాడు ఎప్పుడూనూ-అప్పుడు నేను ప్రేమలో పడ్డం ఇష్టంలేక 'ఊహూ' అన్నాను-అప్పట్నుంచీ.." అని చెప్పబోయేంతలో ఇంటిల్లిపాదీ ఆ గదిలోకి వచ్చారు.

"నేను నవ్వడం మానేశాను" అన్నాడు బ్యాంక్ ఆఫీసర్.

"ఇవ్వాల్టినుంచి నవ్వుతూ ఉండాలని నేను డిమాండ్ చేశాను" అంది కవిత.

భారతికి అయోమయంగా వుంది.

ఆ గందరగోళాన్ని విచ్ఛిన్నం చేస్తూ.."వివేక్‌ని నీకూ కవితని పెద్దాడికీ ఇచ్చి పెళ్లి చేస్తున్నాను. మీ ఇద్దరి తల్లి తండ్రులూ సాయంత్రానికి వస్తారు" అంది లలితమ్మ.

భారతి గుండెనిండా ఆనందాన్ని పీల్చుకుంది- "కోడళ్లయిన మీ ఇద్దరికీ ఇంకో పెద్దగిఫ్ట్" అంది లలితమ్మ జోవియల్‌గా.

ఏమిటీ అన్నట్లు చూసారు కవితా-భారతి.

"మీకు అత్తపోరు ఉండదు" అంది.

అందరూ నవ్వేశారు.

* * *

కానీ..

పెళ్లయిన రెణ్నెళ్లల్లో ఆవిడ ఫోటో ఎన్‌లార్జ్ అయిపోయింది. ఇంట్లో ఏడుపులు ఉండకూడదని ఆవిడ మరణశాసనాన్ని కొడుకులకీ కోడళ్లకీ చదివి వినిపించాడు రాఘవేంద్ర. ఆ మరణశాసనం వింటున్న అందరి కళ్లూ అశ్రుపూరితాలయ్యాయి. బాధతో కాదు, ఆవిడ నిలబడి నవ్విస్తున్నట్లున్న జోకులకి.

*